నత్తనడక పనులతో నరకయాతన..!

నెలలు గడుస్తున్నా ముందుకు సాగని రహదారుల పనులు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డులో కొనసాగుతున్న నిర్మాణ పనులు

చందానగర్: లింగంపల్లి చౌరస్తా నుంచి హఫీజ్‌పేట్ మంచినీటి రిజర్వాయర్ వరకు 6 కిలోమీటర్ల నూతన పైప్‌లైన్‌ను రూ.41 కోట్లతో నిర్మించారు. మంజీరా పైప్‌లైన్ రోడ్డు నిర్మాణం కోసం మొదట విడతగా హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హుడా కాలనీ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ప్రత్యేక నిధులతో శంకుస్థాపన కూడా చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరక ఒక కిలోమీటర్ కూడా రోడ్డు వేయలేదు. రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారు. మంజీరా రోడ్డులో చిన్నపాటి వ్యాపారులతో పాటు పలు కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంకా ఎన్నేళ్లు పనులు కొనసాగిస్తారని స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఒక వైపు దుమ్ము, ధూళీ మరోవైపు గుంతల దారిలోనే ప్రతి రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు టీవీలు, దినపత్రికలలో కథనాలు వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్లకు చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైన్న జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు మంజీరా పైప్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల కష్టాలను తీర్చాలంటున్నారు.

- 100 మీటర్ల సీసీరోడ్డు పనులు పూర్తి
- అసంపూర్తిగానే మిగతా పనులు
- నాణ్యత లోపించడంతో ఎమ్మెల్యే ఆగ్రహం

ఇంజినీరింగ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఇటీవల కొన్ని నెలల క్రితం ప్రారంభమైన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అధికారుల్లో మార్పు రాకపోవడం స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కోట్ల రూపాయాల ప్రజాధనం వృథా చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హుడాకాలనీ ఎక్సైజ్‌స్టేషన్ వరకు రూ.4.31 కోట్లతో సీసీరోడ్డు పనులు గతేడాది అక్టోబర్‌లో స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



నాణ్యత లేని ఇసుక వాడుతున్న దృశ్యం

- ఇప్పటి వరకు 100 మీటర్ల సీసీ రోడ్డు పనులు పూర్తి కాలేదు.
- మైహోం జువెల్ వెనకాల వైపులో ఉన్న ఆర్టీసీకాలనీ తదితర కాలనీవాసులు మాత్రం గుంతల రోడ్డుతో నరకం చూస్తున్నారు.
- వాహనదారులు మాత్రం ఆ రోడ్డు మార్గాన వెళ్లాలంటే జంకుతున్నారు.
- రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- కొన్ని నెలలు పైప్‌లైన్ పనులు అని, ఇప్పుడు రోడ్డు నిర్మాణ పనులంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రజాప్రతినిధులు బహిరంగంగా కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి అభివృద్ధి పనుల్లో నాణ్యత లేక కొన్ని రోజులకే సీసీ రోడ్లు పగులు వస్తున్నాయని తెలిపిన వైనం.
- మంజీరా రోడ్డులో రాత్రి సమయాలలో వాహనదారులు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సిన పరిస్థితి నెలకొన్నది.



నత్తనడకన నడుస్తున్న రోడ్డు నిర్మాణ పనులు



అసంపూర్తి పనులతో వాహనదారుల ఇబ్బందులు

అవస్థలు పడుతున్నాం



మంజీరా పైప్‌లైన్ రోడ్డుకు ఆనుకొని మా ఇల్లు ఉంది. రోడ్డు తవ్వి నెలలు గడుస్తున్నా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు పనులతో తమ కుటుంబం ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ప్రశాంత్, మదీనాగూడ

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. రోడ్డు వేసిన కొన్ని రోజులకే పగులు రావడం విడ్డురంగా ఉంది. ఇప్పటికైన మంజీరా రోడ్డు విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.

– బాబు మోహన్ మల్లేష్, మదీనాగూడ

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఆగిపోయాయని.. ఆయా పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి జె.శ్రీనివాస రావును సోమ వారం కలిసి విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ నూ తన కార్యాలయం, క్రీడామైదానం, మణి కొండ గ్రామ కమ్యూనిటీ హాల్ తదితర పనులు మధ్యలో ఉన్నాయని వివరించారు. వాటికి ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో నిధులను కేటాయిస్తూ తీర్మానం సైతం చేశామన్నారు. వాటిని సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జె.సిద్ధప్ప, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేకాధికారికి వినతి



ప్రత్యేకాధికారిని కలిసిన మణికొండ మాజీ కౌన్సిలర్లు

మణికొండ: మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న జె.శ్రీనివాసరావును సోమవారం మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు కె.రామకృష్ణారెడ్డి, వసంతరావు చౌహాన్ కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ప్రజలకు ఎదురయ్యే దైనందిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయాన సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించాలని కోరారు. నాయకులు బి.శ్రీరాములు, కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- కల్యాణ్ గార్డెన్ ఫీడర్ పరిధిలోని మియాపూర్ మెయిన్ రోడ్డు, రాజారాం కాలనీ, మాధవనగర్ పార్క్, అంబేడ్కర్‌నగర్, నందినగర్ ప్రాంతాలలో ఉదయం 10.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.
- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కొంత భాగం, టెంపుల్ పార్క్, విజయ సూపర్‌మార్కెట్, మాధవనగర్ కొంత భాగం ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో...

కేపీహెచ్‌బీ... కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్ నం.2, 4, 6, 8, ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలోని గ్రీన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, ఇక్రిశాట్ కాలనీ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

గచ్చిబౌలి పరిధిలో...

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు వినాయక్‌నగర్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, మూకో బ్యాంక్ లేన్, గ్రాన్ ల్యాండ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గచ్చిబౌలి ఏఈ భాస్కర్ తెలిపారు. అదే విధంగా నానక్‌రాంగూడ విలేజ్, హనుమాన్ టెంపుల్, ఎస్సీ బస్తీ, శ్రీరాంస్కూల్, చర్చ్ బస్తీ, ఎమరాల్డ్ గార్డెన్, సుమధుర తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300లుగా ఉన్నాయి.

కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాల



స్కూల్ భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమ సహకారంతో గ్రామాల్లో పాఠశాల భవనాలు నిర్మించి ఉన్నత విద్యను అందించడం అభినందనీయం అని ఎంపీ రఘునందర్‌రావు పేర్కొన్నారు. జిన్నారం మండలం కాజీపల్లి గ్రామంలో సోమవారం కెమ్‌టిక్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో 1.9కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పరిశ్రమలు అందిస్తున్న సహకారం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, పరిశ్రమ ఎండి గుల్లపల్లి గోపీకృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల ప్రవేశాలు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ మైనారిటీ గురుకులం పటాన్‌చెరు బాలికల-1 పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను మైనారిటీ విద్యార్థులకు 5వ తరగతి నుంచి ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ, బైపీసీ) వరకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 5 వ తరగతిలో 80, 6వ తరగతి– 28, 7వ తరగతి– 22, 8వ తరగతిలో –17 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ఫస్టియర్‌లో 80 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం సంబంధిత వెబ్‌సైట్ లేదా పటాన్‌చెరు బాలికలు–1 పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7995057882, 8106721827 లను సంప్రదించాలన్నారు.

తెల్లాపూర్ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా ఫాల్గుణ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేక పాలన అధికారులను నియమించింది. దీంతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా నియమితులైన మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ ఫాల్గుణ్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి హాజరయ్యారు.

తుది దశకు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్లైఓవర్ ప్రారంభం

చందానగర్: చందానగర్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సుమారు రూ.170 కోట్లతో చేపడుతున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. 1.65 కిలో మీటర్ల మేర పొడవు ఉన్న 6 లేన్ల రోడ్డు నిర్మాణం తుదిదశకు చేరుకుందని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. సోమవారం కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో త్వరలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయని అన్నారు. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులు కూడా పూర్తి చేయాలన్నారు. సర్వీస్ రోడ్డులో తీసిన గుంతలను వెంటనే పూడ్చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, ఓర్సు వెంకటేష్, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

23న మల్లన్న జాతర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 23న మల్లన్న జాతరను నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ బి.పుష్ప తెలిపారు. సోమవారం నూతనంగా ఆలయ కమిటీ, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఏటా మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరితో చర్చించి జాతరను వైభవంగా నిర్వహించేలా నిర్ణయించినట్లు చెప్పారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 15 మందికి రూ. 2 వేలు, మరో ఐదుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: భారత సంవిధాన్ దివాస్ సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ నేతృత్వంలో అసెంబ్లీ కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి సురేంద్ర శర్మతో కలిసి రాజ్యాంగ రక్షణ ర్యాలీ కొనసాగింది. మహంకాళి నగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్లమ్మబండ, ఆల్విన్‌కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు.

యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూర్, టెడెక్స్ స్పీకర్ విభూతి జైన్



ఎంటర్‌ప్రెన్యూర్ డేలో నమూనాలను తిలకిస్తున్న అతిథులు

రాయదుర్గం: విద్యార్థులు చదువు పూర్తయ్యాకా ఉద్యోగం కోసం ఎదురుచూపులు మాని ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూర్, టెడెక్స్ స్పీకర్ విభూతి జైన్ సూచించారు. రాయదుర్గంలోని సాలిటైర్ బిజినెస్ స్కూల్‌లో సోమవారం 'ఎంటర్‌ప్రెన్యూర్స్ డే'వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ఇందులో ఉత్తమ నమూనాలు తయారు చేసిన విద్యార్థులకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్య చదివే విద్యార్థులు స్టార్టప్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గానే మారితేనే ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని అన్నారు. సాలిటైర్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ డానియల్ ముర్తుజాఅలీ మాట్లాడుతూ.. విద్యార్థులలో విశ్వాసాన్ని పెంచడానికి ఎంటర్‌ప్రెన్యూర్ డేను నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాలిటైర్ బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూకంపాలను తట్టుకునే పరిజ్ఞానం

ఎన్‌ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ వెంకటరమణ

పటాన్‌చెరు: భూకంపాలను తట్టుకునేలా భవనాలు నిర్మించేందుకు అత్యాధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని ఎన్‌ఐటీ సూరత్కల్ మాజీ డీన్ (విద్య) ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ భూకంప శాస్త్రం గత భూకంపాల నుంచి నేర్చుకోవడం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భూకంప నిరోధక భవన నిర్మాణ డిజైన్ కోసం బేస్ ఐసోలేషన్ టెక్నిక్, బ్రేసింగ్ సిస్టం వంటి పలు వినూత్న పద్ధతులు ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఎయిర్ బ్యాగ్ విధానంలో భూకంపం వచ్చినప్పుడు భవనం కొద్దిగా పైకి లేచి, ప్రకంపనలు తగ్గిపోగానే యథాస్థితికి వచ్చే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో ఉందన్నారు. భూకంపాలు టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్ల సంభవిస్తాయని, సీస్మోగ్రాఫ్ ద్వారా దాని తీవ్రతను కొలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ వెంకట రమణ

క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయం

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఎంఆర్ హైలాండ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... క్రీడా పోటీలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి బహుమతులను అందజేయడం మంచి పరిణామమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు సామా నర్సింహారెడ్డి, అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్‌రావు, పిచ్చయ్య, మల్లారెడ్డి, నవీన్, కళ్యాణ్, వేదశ్రీ, సుగుణ, శోభ, బాలరాజు, శ్ర జయతీర్థ, హరికిషోర్, వాణి, భాస్కర్‌రెడడి, కొణిదేనా కృష్ణ రావు, విశ్వనాథం, పద్మ విశ్వనాథం పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



ఆదేశాల అమలేది?

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టవద్దన్న హైకోర్టు ఆదేశాలు పారిశుద్ధ్య సిబ్బంది ఉల్లంఘిస్తున్నారు. జీవవైవిధ్య స్థలంగా గుర్తించిన అమీన్‌పూర్ పట్టణంలోని పెద్దచెరువు వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను సోమవారం తగలబెట్టగా 'సాక్షి' కెమెరాకు చిక్కింది. పర్యావరణానికి హాని కలిగించేలా చెత్త తగలబెట్టడాన్ని అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశాలు కచ్చితంగా అమలు చేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

–పటాన్‌చెరు

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, డీసీ మోహన్‌రెడ్డి



సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: ప్రజావాణిలో అందుకున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అధికారులకు సూచించారు. సోమవారం చందానగర్ సర్కిల్–21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ఉపకమిషనర్ మోహన్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల నుంచి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై స్పందించి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఈఈ కేవీఎస్ రాజు, డీఈ శ్రీదేవి, దుర్గాప్రసాద్, ఏఈలు ప్రశాంత్, ప్రతాప్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి, అక్బర్‌ఖాన్ పాల్గొన్నారు.

కార్యాలయంలో నూతన లిఫ్ట్ ప్రారంభం.

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సుమారు రూ.29.80లక్షలతో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యాలయానికి వచ్చే వికలాంగులు, మహిళలు, వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

ప్రజావాణి వినతులపై తక్షణ చర్యలు

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: ప్రజావాణిలో వచ్చిన వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్లను శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ, వెటర్నరీ శానిటేషన్ అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో జోనల్ కార్యాలయంలో ఏడు, జోన్ వ్యాప్తంగా మొత్తం 17 వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ శంకర్, ఈఈ మల్లికార్జున్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, సిటీప్లానర్ శ్యామ్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

